క్లుప్తంగా

అయ్యప్పకు ప్రత్యేక పూజలు


అయ్యప్పస్వామి

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం శ్రీహరిహర సుత అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం సందర్భంగా స్వామి వారికి పంచామృత అభిషేకాలు, విశేష పూజలు అర్చకులు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

22న చండీహోమం


విజయదుర్గమ్మ

జంగారెడ్డిగూడెం: స్థానిక విజయ దుర్గమ్మ ఆలయంలో ఈ నెల 22న అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం పురస్కరించుకుని చండీ హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. హోమం అనంతరం రాత్రి ఎనిమిది గంటలకు అమ్మవారి అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనే భక్తులు ఆలయంలో టోకెన్లు తీసుకోవాలని కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే చండీహోమంలో ఉభయదారులుగా పాల్గొనదలచిన భక్తులు ముందుగా ఆలయ కమిటీని సంప్రదించాలన్నారు.

ప్రకృతి ఎరువులపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్లు

కొయ్యలగూడెం: ప్రకృతి ఎరువులపై అవగాహన మరింత పెంచాల్సిన ఆవశ్యకత ఉందని రాష్ట్ర కమ్యూనిటీ నేచురల్ ఫామింగ్ డీపీఎం తాతారావు పేర్కొన్నారు. బుధవారం బయ్యన్నగూడెం సమీపంలోని కృష్ణ గోశాల ప్రకృతి ఉత్పత్తుల శిక్షణ కేంద్రం వద్ద 60 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ప్రకృతి ఎరువుల తయారీపై రిసోర్స్ పర్సన్ సుంకర సత్యారాజు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డీపీఎం వెంకటేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కళ్యాణ్, యూనిట్ ఇన్‌చార్జి సంజీవ రావు, తదిరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక చర్యలు


రైస్ మిల్లులో తనిఖీ చేస్తున్న అధికారులు

బుట్టాయగూడెం: ఏలూరు జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి ఏప్రిల్ 1వ తేదీ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నట్లు సివిల్ సప్లై జిల్లా అధికారి శ్రీలక్ష్మి తెలిపారు. బుట్టాయగూడెం కొమ్ముగూడెం సెంటర్ సమీపంలో ఉన్న రైస్‌మిల్‌ను సివిల్ సప్లై అధికారులు బుధవారం తనిఖీ చేశారు. డీఎం మాట్లాడుతూ గత ఏడాది జిల్లాలోని 21 మండలాల్లో 259 సెంటర్ల పరిధిలో సుమారు రూ.3.55 లక్షల హెక్టార్ల వరకూ ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. అలాగే రబీ సీజన్‌లో సుమారు 139 సెంటర్లలో ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ ప్రతాపరెడ్డి, ఎస్‌డీసీ దేవకీదేవి, బుట్టాయగూడెం సీఎస్‌ఆర్‌ఐ కుంజం పద్మ, తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ లడ్డూ వేలం

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరం కనకదుర్గమ్మ అమ్మవారి తిరునాళ్లలో ఐదు రోజులు పూజలందుకున్న లడ్డూను బుధవారం వేలం నిర్వహించారు. కనకదుర్గమ్మ లడ్డూను అల్లూరి రత్నాజీరావు రూ.51,000లకు వేలంలో దక్కించుకున్నట్లు ఆలయ ధర్మకర్త భౌమరాజు సత్యనారాయణరాజు తెలిపారు. అదే విధంగా స్వామి వారి లడ్డూను భక్తుడు తాండ్ర వీరకృష్ణ రూ.50,000లకు దక్కించుకున్నట్లు తెలిపారు. ఈ లడ్డూ వేలంలో ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా శ్రీనివాసబాబు


శ్రీనివాసబాబు

పోలవరం రూరల్: పోలవరం ఎంపీడీవోగా సీహెచ్ శ్రీనివాసబాబు బాధ్యతలు స్వీకరించారు. ఈయన కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తున్నారు. ఎంపీడీవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు అందాయి. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీవోగా, ఈవోపీఆర్‌డీ కె.శ్రీనివాస్ బాధ్యతలు నిర్వహించారు.

బాలల భవితకు భరోసా


పిల్లలకు ఆటపాటలతో విద్యను నేర్పుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం తీసుకుంటున్న చిన్నారులు

- 'పోషణ్‌బీ–పఢాయిబీ' పథకంతో చిన్నారుల ప్రగతి
- పథకం అమలుపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ
- ప్రీ స్కూల్స్‌గా అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి

బుట్టాయగూడెం: బాలల భవితకు కేంద్ర ప్రభుత్వం మరో పథకానికి శ్రీకారం చుట్టింది. భావి భారత విజ్ఞానంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండాలన్న లక్ష్యంతో పోషణ్‌భీ–పడాయిబీ పథకం అమలు చేస్తుంది. ముఖ్యంగా చిన్నారులు తొలి అడుగులు వేసే అంగన్‌వాడీ కేంద్రాలపై దృష్టి సారించింది. జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ సూల్స్‌గా అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. చిన్నారులకు విద్యతో పాటుగా ఆరోగ్య సంరక్షణపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పోషణ్‌భీ–పడాయిబీ పథకంపై అవగాహన కోసం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. బాల్య సంరక్షణ విద్య (ఎర్లీ చైల్డ్‌వుడ్ కేర్ ఎడ్యుకేషన్ ఈసీసీఈ)పై మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ బాధ్యతలను నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ కో–ఆపరేషన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ (ఎన్ఐపీసీసీడీ)కి అప్పగించారు.

ఐటీడీఏ పరిధిలో 319 సెంటర్లలో అమలు

ఐటీడీఏ పరిధిలో బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాల్లో సుమారు 329 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్‌భీ–పడాయిబీ కార్యక్రమం అమలుకు అధికారులు కృషి చేస్తున్నారు. విద్యార్థులకు ఆట పాటలతో కూడిన విద్య అందించడంతో పాటు వారి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ కోసం చర్యలు తీసుకుంటున్నారు. బుట్టాయగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 3 నుంచి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలు 1775 మంది ఉన్నారు. అదే విధంగా కుక్కునూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 1079 మంది విద్యార్థులు అంగన్‌వాడీ కేంద్రంలో ఆటపాటలతో కూడిన విద్యను నేర్చుకుంటున్నారు.

నూతన విద్యా విధానం అనుసరించి

నూతన విద్యా విధానం అనుసరించి అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యతతో కూడిన పౌష్టికాహారం, మౌలిక సదుపాయాలు, ఆట పరికరాలను సమకూరుస్తూ శిక్షణ పొందిన కార్యకర్తలతో ఈసీసీఈ విధానంలో అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ



అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న చిన్నారుల పౌష్టికాహార లోపాన్ని తగ్గించేందుకు శారీరక, మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటున్నాం. అలాగే వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. పోషణ్‌బీ–పడాయిబీ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమైంది. ఆరు రోజుల శిక్షణ అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా కార్యక్రమం అమలుకు కృషి చేస్తున్నాం.

–ఏలూరు తులసి, సీడీపీఓ, బుట్టాయగూడెం

అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ



పోషణ్‌బీ–పడాయిబీ కార్యక్రమం అమలుపై అంగన్‌వాడీ కార్యకర్తలకు బాల్య సంరక్షణ విద్య, ఈసీసీఈపై శిక్షణ ఇచ్చాం. పిల్లలకు విజ్ఞానంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం కలిగించడమే ముఖ్య లక్ష్యంగా కృషి చేస్తున్నాం.

–వై.వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్, దొరమామిడి సెక్టార్

నలుగురు జూదరుల అరెస్టు

చింతలపూడి: మండలంలోని యండపల్లి శివారు పేకాట సార్ధవరంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి 23,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై కుటుంబరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోకో రైతుల సదస్సును జయప్రదం చేయాలి

టి.నరసాపురం: కోకో రైతులు సంఘటితం కావాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య పిలుపునిచ్చారు. బుధవారం రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో రైతు సంఘం మండల కార్యదర్శి అనుమోలు మురళి అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సీతారామయ్య మాట్లాడుతూ మార్చి 20న జిల్లాలోని పెదవేగి మండలం విజయరాయిలో నిర్వహించనున్న కోకో రైతుల రాష్ట్ర సదస్సుకు రైతులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పి.వెంకటేశ్వరరావు, పాయం చిన లక్ష్మడు, బరగడ అగ్గి రాముడు, తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలే లక్ష్యం


రికార్డులను పరిశీలిస్తున్న ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ప్రభుకుమార్

జంగారెడ్డిగూడెం/పోలవరం రూరల్: సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నవోదయం 2.0 కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కేవీఎస్ ప్రభు కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను బుధవారం ప్రభుకుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నాలుగు మండలాల్లో ఏ–కేటగిరీగా ఎనిమిది గ్రామాలు, బీ–కేటగిరీగా ఐదు గ్రామాలు, సీ–కేటగిరీగా 11 గ్రామాలను సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి ప్రజల్లో అవగాహన, కళాజాత నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏలూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.ఆవులయ్య, అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.పాండురంగారావు, జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ శ్రీనుబాబు, ఎస్సై సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గాలి గోపుర నిర్మాణం పూర్తి


నూతన గాలి గోపురం

కొయ్యలగూడెం: అంకాలగూడెంలోని శ్రీఉమా సమేత భోగలింగేశ్వర స్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన గాలి గోపుర నిర్మాణం పూర్తయింది. ఆలయానికి తూర్పు వైపు 42 అడుగుల ఎత్తుతో గాలి గోపుర నిర్మాణ పనులు గత సంవత్సరం మార్చి 29న ప్రారంభించి పనులు పూర్తి చేశారు. సుమారు అర్ధ శతాబ్దం ప్రాశస్త్యం కలిగిన ఆలయానికి దాతల సహకారంతో గాలి గోపుర నిర్మాణం పూర్తి చేసినట్లు అభివృద్ధి కమిటీ చైర్మన్ తోట వెంకటేశ్వరరావు తెలిపారు. ఇందుకు రూ.35 లక్షలు ఖర్చు చేశారు. ఆలయంలోని దక్షిణం వైపు సామూహిక పూజా మండపాన్ని కూడా పూర్తి చేసి ఏపిరయల్ లేదా మే నెలలో ప్రారంభోత్సవం చేయనున్నట్లు వెంకటేశ్వరరావు తెలిపారు.

రైతులకు రాయితీపై పనిముట్లు


కొయ్యలగూడెం: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు


చింతలపూడి: కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ కె.ఫణికుమార్

కొయ్యలగూడెం: సబ్సిడీపై వ్యవసాయానికి సంబంధించిన యాంత్రిక పరికరాలు అందజేస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.చెన్నకేశవులు పేర్కొన్నారు. పరింపూడి, గవరవరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు వ్యక్తిగతంగా రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, ట్రాక్టర్ పనిముట్లు, స్ప్రేయింగ్ యంత్రాలు, పవర్ టిల్లర్లు, అందజేస్తున్నామన్నారు. కావలసిన వారు వ్యవసాయ శాఖ సిబ్బందిని గాని, రైతుసేవా కేంద్రంలో గాని సంప్రదించాలని సూచించారు. ఈ నేపథ్యంలో చిన్న, సన్నకారు రైతులకు 50 శాతం రాయితీపై పంపిణీ చేస్తామన్నారు. మొక్కజొన్న, వరి పొలాలను సందర్శించారు. కార్యక్రమంలో సెరికల్చర్ అధికారి, రైతు సేవ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సాగులో వెదజల్లే పద్ధతి మేలు

చింతలపూడి: రైతులు సాగులో వెదజల్లే పద్ధతిని అలవర్చుకోవాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏలూరు ఏరువాక కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ కె.ఫణికుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని వెంకటాద్రిగూడెం గ్రామంలో మండల వ్యవసాయ అధికారిణి కె.మీనాకుమారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఫణికుమార్ మాట్లాడుతూ వరి, మొక్కజొన్న, ఆయిల్ పాం పంటల్లో వచ్చే తెగుళ్లను గురించి రైతులకు వివరించారు. మండల వ్యవసాయ అధికారిణి కె.మీనాకుమారి మాట్లాడుతూ ప్రతి రైతూ విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం రేచర్ల గ్రామంలో ఏలూరు ఏరువాక కేంద్రం వేరుశనగలో కొత్త రకం టీసీజీఎస్ 1694పై నిర్వహిస్తున్న క్షేత్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త ఎస్.నాగేంద్రబాబు, వెంకటాద్రిగూడెం రైతుసేవా కేంద్రం సిబ్బంది అజయ్, చిన్నా, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అధికారుల పేరుతో అక్రమాలకు పాల్పడితే చర్యలు


విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ యు.రవిచంద్ర

జంగారెడ్డిగూడెం: ప్రభుత్వ అధికారుల పేరుతో, ప్రభుత్వ కార్యాలయాల స్టిక్కర్లను తగిలించుకుని అక్రమాలకు, అన్యాయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ యు.రవిచంద్ర హెచ్చరించారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం నల్లజర్ల టోల్‌గేట్ వద్ద ఓ వ్యక్తి సీఎంవో కార్యాలయం స్టిక్కర్ వేసుకుని హల్‌చల్ చేశారని, ఘటనను చిత్రీకరిస్తున్న మీడియా ప్రతినిధిపై దాడి చేశారన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తిని జంగారెడ్డిగూడెంలో అనేక కేసుల్లో నిందితుడిగా ఉన్న ఊరకరణం జగన్నాథంగా గుర్తించామన్నారు. అతడిపై జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ కూడా ఉందన్నారు. జగన్నాథం కామవరపుకోటలో నివాసం ఉంటూ, అక్కడే తపస్య స్కూల్‌ను నడుపుతున్నాడన్నారు. స్కూల్‌ను నడిపే భాగంలో వేరే స్కూల్ యజమాని దాసు అనే వ్యక్తితో విభేదాలు రావడంతో, అతడిపై బెదిరింపులకు దిగాడన్నారు. సీఎంవో కార్యాలయం పేరును వినియోగిస్తూ డబ్బులు డిమాండ్ చేశాడన్నారు. నల్లజర్ల వద్ద జరిగిన ఘటనలో జగన్నాథాన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని, ప్రస్తుతం ఆయన ఏలూరు జైల్‌లో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు.

ఆక్రమణల క్రమబద్ధీకరణ


సమావేశం నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్

జంగారెడ్డిగూడెం: 2019 అక్టోబర్ 15 కంటే ముందు ఉన్న ఆక్రమణలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం జీవో జారీ చేసిందని తహసీల్దార్ కె.స్లీవజోజి, మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ అన్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయంలో వీఆర్వో, డిజిటల్ అసిస్టెంట్లు, కౌన్సిలర్లకు బుధవారం తహసీల్దార్, కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 అక్టోబర్ 15 కంటే ముందు ఆక్రమించిన వారికి నిబంధనలు అనుసరించి మహిళల పేరున మాత్రమే క్రమబద్ధీకరణ పట్టాలను మంజూరు చేయాలన్నారు. 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరణ చేయాలని, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ఆదాయపన్ను చెల్లింపుదారులు అయి ఉండకూడదన్నారు. పట్టణాల్లో నెలకు రూ.14,000 ఆదాయం ఉండాలని, నెలకు రూ.300 లోపు విద్యుత్ చార్జీలు చెల్లింపు ఉండాలని, మెట్ట మాగాణి కింద కలిపి 10 ఎకరాలకు మించి ఉండకూడదని, ఆర్‌సీసీ రూఫ్, అస్ బెస్టాస్ రూఫ్‌ను ఇటుక గోడలతో నిర్మించి ఉండాలన్నారు. నాలుగు చక్రాల వాహనం ఉండకూడదన్నారు. సమావేశంలో తహసీల్దార్, కె.స్లీవజోజి, మున్సిపల్ కమిషనర్, కె.వెంకటరమణతో పాటు పట్టణ కౌన్సిలర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు


ఏరియా ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం

జంగారెడ్డిగూడెం: మెట్ట ప్రాంత కాపు మహిళా సేవా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం చలి వేంద్రం ఏర్పాటు చేశారు. స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బేబీ కమల, సాయిస్ఫూర్తి ఆసుపత్రి పిల్లల వైద్యులు సంకు నాగరత్నం ప్రారంభించారు. కార్యక్రమంలో జెట్టి శైలజ, ఆకుల సీత, బండారు సత్యవతి, వెలగా ప్రసన్న, యర్రంశెట్టి రమాదేవి, మోటేపల్లి సుజాత, పాటంశెట్టి రమ్య, పాలపర్తి నిర్మల, వంకా రోజా, పోల్నాటి చంద్ర, రాజనాల కుమారి, మైరెడ్డి లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలి


తహసీల్దార్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

టి.నరసాపురం: గ్రామాల్లోని శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. టి.నరసాపురంలో బుధవారం సీపీఎం ప్రజా చైతన్యయాత్ర ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ నాయకులు గుడెల్లి వెంకట్రావు, నారాయణ మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాలకు రోడ్లు సౌకర్యాలు కల్పించాలని, శ్మశాన వాటికల్లో సమస్యలను పరిష్కారం చేయాలన్నారు. అల్లూరి సీతారామరాజు నగర్ కాలనీవాసులకు 17 ఏళ్ల నుంచి కనీసం రోడ్లు, డ్రెయినేజీలు, మంచినీటి సౌకర్యం లేకుండా ఇబ్బంది పడుతున్నారని, హైకోర్టు తాగు నీరు, ఎంజాయ్‌మెంట్లు ఇమ్మని చెప్పినప్పటికీ కూడా స్పందన లేకుండా అధికార యంత్రాంగం ఉందని తక్షణమే తాగునీరు, కరెంటు సౌకర్యాన్ని పునరుద్ధరించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది 9 నెలలు ఉద్యోగ ఉపాధి అవకాశాలను మెరుగు పరచలేదని రాష్ట్రాన్ని ఆదానికి కట్టబెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు అనుమోలు మురళి, మడకం కుమారి, బరగడ కుమారి, శిరీష, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లతో ఆర్‌డీఓ సమీక్షా సమావేశం


తహసీల్దార్లతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్‌డీఓ

బుట్టాయగూడెం: పోలవరం నిర్వాసితులను సకాలంలో తరలించే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నామని జంగారెడ్డిగూడెం ఆర్‌డీఓ ఎంవీ రమణ తెలిపారు. బుట్టాయగూడెం తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం మండలాలకు చెందిన తహసీల్దార్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం నిర్మించిన నిర్వాసిత కాలనీల్లో మౌలిక సదుపాయాల వివరాలు, మిగులు భూముల వివరాలు, ఆర్‌అండ్‌ఆర్ చెల్లించవలసిన లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా నిర్వాసితులను తరలించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు పీవీ చలపతిరావు, చల్లన్నదొర, ఉదయ్‌భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో అభ్యంతరాల స్వీకరణ

పోలవరం నియోజకవర్గంలోని పలు పార్టీలకు చెందిన నాయకులతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా తయారీపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని కోరారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు నమోదు ప్రక్రియ కార్యక్రమం కొనసాగుతూనే ఉందన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ప్రతి సంవత్సరం 18 సంవత్సరాలు నిండిన వారు ఓటును నమోదు చేసుకోవాలన్నారు. అయితే ఆయా బూత్‌ల పరిధిలో డబుల్ ఎంట్రీలు, డెత్‌లు, చేర్పులు, మార్పులు వంటివి ఏవైనా ఉంటే సంబంధిత బీఎల్‌ఓల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, బీజేపీ నాయకులు కొండేపాటి రామకృష్ణ, న్యూడెమోక్రసీ నాయకులు సరియం రామ్మోహన్‌రావు, టీడీపీ నాయకులు మనెల్లి బాలు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వర్జీనియా రైతులతో భేటీ


సమావేశంలో మాట్లాడుతున్న గ్రేసీ మార్గరెట్

కొయ్యలగూడెం: ఎన్‌ఎల్‌ఎస్ పరిధిలో వర్జీనియా పొగాకు వేలం కేంద్రాల్లో ఈ నెల 24వ తేదీ నుంచి కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్లు కొయ్యలగూడెం వేలం కేంద్రం నిర్వహణ అధికారిణి గ్రేసీ మార్గరెట్ పేర్కొన్నారు. బుధవారం వేలం కేంద్రంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ప్రస్తుతం వేలం కేంద్రం పరిధిలో ఉన్న బేరన్లకు అదనంగా మరో 220 బేరన్లు చేరాయన్నారు. అందువలన క్లస్టర్లకు అదనంగా మరొకటి చేరడంతో క్లస్టర్ల సంఖ్య ఎనిమిదికి పెరిగిందన్నారు. ప్రారంభం రోజున 45 లేదా 99 బేళ్లతో ప్రారంభిస్తామని కార్యక్రమానికి బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్‌తో పాటు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఈడీని ఆహ్వానించనున్నారు. పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు కాకర్ల నంది, ముప్పనాపల్లి వెంకటేశ్వరరావు, కాకర్ల శేషు, ఎస్‌కే సయ్యద్ బాజీ (సైదులు), తోటకూర శ్రీనివాసు, తాండ్రు రామకృష్ణ, శుక్లబోయిన సత్యనారాయణ, దగ్గు సత్తిబాబు, అడపా సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

బుట్టాయగూడెం: పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ రైతు కూలీ సంఘం, ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ మాట్లాడుతూ గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇచ్చి హక్కు కల్పించాలని కోరారు. అదే విధంగా 1/70, పీసా, అటవీ హక్కుల చట్టంపై కోనేటి రంగారావు కమిటీ సిఫార్సులను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


బాధితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ద్వారకాతిరుమల: మండలంలోని జి.కొత్తపల్లిలో ఇటీవల మృతి చెందిన రేవూరి కుమారి కుటుంబానికి వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ బిరుదుగడ్డ బజారియ్య, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దాసరి ఏసురత్నం, తదితరులు బుధవారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. ముందుగా వారు మృతురాలి కుమారుడు నాగరాజును, కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం రూ.2 వేల నగదు, 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పున్నపు కృష్ణ, రాచకర్ల కృష్ణ, కస్సే గంగరాజు, గంజి నాగార్జున, పొంగులేటి సంతోష్, బోడ రవి, గంట వెంకట ధర్మారావు, రెడ్డి చిన్ని, బోడ సంతోష్, బోడ మధు, భూపతి కన్నా, కట్టూరి మంగరాజు, దంసెల్లి రమేష్, రేవూరి మల్లేష్, కస్సే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.